

స్టాళ్ల వద్ద వివరాలను తెలుసుకుంటున్న మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యే బిగాల

## అట్టహాసంగా..

- ప్రారంభమైన 'నమస్తే' ప్రాపర్టీ షో
- హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన జిల్లా వాసులు
- కొలువుదీరిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల స్టాళ్లు

వివరాలు 13లో..

**జిల్లా కేంద్రంలోని** హైదరాబాద్ రోడ్డులో ఉన్న వేణుమాల్‌లో నమస్తే తెలంగాణ , తెలంగాణ టుడే ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి , అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా హాజరై ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ప్రదర్శనలో 22 ప్రముఖ రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ సంస్థల స్టాళ్లు కొలువుదీరాయి. పెద్ద సంఖ్యలో జిల్లావాసులు తరలివచ్చి స్టాళ్లను సందర్శించారు. వివిధ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చేపట్టిన ప్రాజెక్టులు, నిర్మాణాలు, వెంచర్లు, విల్లాలు, అపార్ట్ మెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఖలీల్‌వాడి, మార్చి 8

# ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్‌కేవీ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కేవీ ప్రతినిధి విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలపై దాడులను అరికట్టడంలో రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. బీసీలకు 42 శాతం కోటా కోసం తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత పోరాటం చేసి విజయం సాధించారన్నారు. ఆమె చేసిన ఉద్యమంతో సర్కారు దిగొచ్చిందన్నారు. కార్యక్రమంలో అనసూయ, జ్యోతి, నవతారాణి, దేవిక, సునీత, మహేశ్వరి, హర్షిక పాల్గొన్నారు.

# పేరుకే పసుపు బోర్డు ఏర్పాటు

- రైతులకు ఒరిగింది శూన్యం
- రూ .15వేలు మద్దతు ధర ఇవ్వాలి
- రూ.12వేలు ఇస్తామని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు ఫోన్



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

మోర్తాడ్, మార్చి 8: జిల్లాకు పసుపుబోర్డు వస్తే పసుపునకు మంచి ధర వస్తుందనుకున్న రైతులకు నిరాశే మిగిలిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పేరుకే పసుపు బోర్డు ను ఏర్పాటు చేశారని, నామమాత్రపు ఎంఎస్‌పీ ఇస్తున్నారని పేర్కొన్నారు. పసుపుబోర్డు వస్తే క్వింటాలుకు రూ.15వేల మద్దతు ధర ఇవ్వాలని, ఎందుకు ఇవ్వడంలేదని కేంద్రప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ.12వేల మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు రైతులకు వచ్చే ధరకు రూ.12వేలకు తగ్గిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పసుపు పంటకు మద్దతు ధర ఇవ్వకుండా రైతులను గోస పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శనివారం ఆయన మోర్తాడ్ మండలంలో పర్యటిస్తుండగా పాలెం గ్రామంలో పసుపు రైతులు కలిసి తమ గోడును విన్నవించారు. దీంతో వేముల వెంటనే కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటైనా పసుపునకు మద్దతు ధర కరువైందన్నారు. జిల్లా రైతులు సాంగ్లీవైపు చూసే పరిస్థితులు ఏర్పడినా ప్రభుత్వాలు పట్టించుకోకపోతే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పసుపురైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకపోతే రైతుల పక్షాన నిలబడి, వారి కోసం ఉద్యమిస్తామన్నారు. గంజ్‌లో పసుపు రైతులకు నష్టాలు కలిగించేలా పరిస్థితులు కొనసాగితే సహించేదిలేదన్నారు. పాలక వర్గం, దళారులు సిండికేట్‌గా మారి పసుపు ధరను తగ్గించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. కొమ్ము పసుపునకు రూ.10 వేలు, మండ పసుపునకు కనీస మద్దతు ధర రూ.9 వేలు కటాఫ్ నిర్ణయించిన తర్వాత ఇప్పుడు కటాఫ్‌ను తగ్గిస్తున్నట్లు రైతులు దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సిండికేట్ ఆగడాలను అరికట్టి కటాఫ్ ఎట్టిపరిస్థితులో తగ్గకుండా చూడాలని సూచించారు. ఆరంభంలో నిర్ణయించిన కొమ్ముకు ఉన్న కటాఫ్ రేట్‌ను రూ.10వేల నుంచి రూ.9 వేలకు, మండకు రూ.9వేలను కాస్తా రూ.8 వేలకు తగ్గించినట్లుగా రైతులు చెప్తున్నారని, ఒకసారి నిర్ణయించిన ధరను తిరిగి తగ్గిస్తే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ధర ను తగ్గించే ప్రయత్నం చేస్తున్న వారిపై వెంట నే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతేడాది పసుపునకు మంచి ధర వచ్చిందని రైతులు ఈసారి కూడా ఎంతో ఆశతో పసుపుపంటను పండించారని తెలిపారు. కానీ గంజ్‌లో నడుస్తున్న నాటకాలతో రైతులు మోసపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇదే కొనసాగితే రైతులతో కలిసి ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

# అమ్రాద్ తండాలో కత్తిపోట్లు

- అదనపు బియ్యం కోసం రేషన్ డీలర్‌తో వాగ్వాదం
- డీలర్ భర్తతోపాటు అతడి సోదరులపై దాడి
- ఒకరి పరిస్థితి విషమం
- తండాలో పోలీస్ పికెట్ ఏర్పాటు



రేషన్ దుకాణం వద్ద కాపలాగా పోలీసులు

మాక్లూర్, మార్చి 8: మండలంలోని అమ్రాద్ తండాలో కత్తిపోట్ల ఘటన శనివారం కలకలం రేపింది. తండాలోని ముగ్గురు అన్నదమ్ములపై అదే తండాకు చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం విషయంలో కత్తితో దాడిచేశాడు. తండా నడిబొడ్డున పట్టపగలు జరిగిన ఈ ఘటనతో తండావాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తండావాసులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలోని రేషన్ డీలర్ మాలోత్ సునీత శనివారం బియ్యం పంపిణీ చేస్తున్నది. తండాకు చెందిన భూక్య రమేశ్ అలియాస్ విక్రమ్, అతడి సోదరుడు పీర్‌సింగ్ కలిసి దుకాణానికి బియ్యం కోసం వచ్చారు. అప్పటికే వారు ఈనెల తమ కోటాకు సంబంధించిన బియ్యం తీసుకున్నారు. అదనంగా మరో 50 కిలోల బియ్యం ఇవ్వాలని డీలర్ సునీతతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆమె తన భర్త జ్యోతిరాంనాయక్‌కు సమాచారాన్ని చేరవేసింది. జ్యోతిరాంనాయక్‌తో పాటు అతడి సోదరులు రాజునాయక్, శ్రీనివాస్ నాయక్ దుకాణం వద్దకు వచ్చారు. పీర్‌సింగ్‌తో పాటు వీరికి తీవ్ర వాగ్వాదం జరిగింది. వెంటనే రమేశ్ ఇంటికి వెళ్లికత్తితో వచ్చి అన్న పీర్‌సింగ్‌తో కలిసి డీలర్ భర్తతోపాటు అతడి సోదరులపై దాడిచేశాడు. దీంతో ముగ్గురు అన్నదమ్ములకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. రాజునాయక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని స్థానికులు తెలిపారు. తండావాసులు పెద్ద ఎత్తున గుమిగూడడంతో రమేశ్, పీర్‌సింగ్ అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజశేఖర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. డీలర్ సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా తండాలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు.

లక్కాకుల రాజయ్య వరి పొలంలో మేస్తున్న పశువులు



రామారెడ్డికి చెందిన లక్కాకుల నడిపి రాజయ్య రైతు. ఆయన యాసంగిలో ఒకటిన్నర ఎకరాల్లో రూ.40 వేల పెట్టుబడి పెట్టి వరి వేశాడు. పైరు ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నది. అయితే, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బావి అడుగంటింది. బోరు కూడా ఎత్తిపోయింది. కండ్ల ముందే పొలం బీటలు వారగా, పంట ఎండిపోయింది. చేసేది లేక పంటను పశువులకు వదిలేశాడు.

# పొలంలో బీళ్లు.. రైతు కంట కన్నీళ్లు..

- సంక్షోభంలో ఎవుసం..
- సర్కారు నిస్తేజం
- బీళ్లు వారుతున్న పొలాలు
- ఎండుతున్న పంటలు
- కలవరపడుతున్న అన్నదాతలు
- పంట పశువుల పాలు..



ఏం చేయాలో అర్థమైతలేదు..

**ఎవుసం ఎండుతున్నది.** సాగు సంక్షోభంలోకి జారుకుంటున్నది. పొలం బీడు వారుతుంటే రైతు గుండె తల్లడిల్లుతున్నది. ఉమ్మడి జిల్లాలో సాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుండడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది. వేసవికి ముందే కరువు ఛాయలు తలెత్తడంతో కర్షకులు కలవరపడుతున్నారు. కండ్ల ముందే పంట ఎండుతుండడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉన్న బోర్లు ఎత్తిపోయాయి. కొత్తవి వేస్తే నీటి చుక్క జాడ లేక అన్నదాతకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట ఎండి పోతుండడం, బోర్లు వేసేందుకు వెచ్చిస్తున్న లక్షల రూపాయలు అప్పుగా మిగులుతుండడంతో రైతు బతుకు దుర్భరమవుతున్నది.

– రామారెడ్డి, మార్చి 8

> ఒకటిన్నర ఎకరంల వరి ఏసిన. దున్నుడు, నాట్లు ఏసుడు, మందులకు ఇప్పటిదాకా నలభై వేలు ఖర్సు వెట్టిన. పొలం మంచిగున్నది. ఇక ఢోకా లేదనుకున్న. అంతట్లనే బాయి ఎండిపాయే. బోరు సుత ఎత్తిపాయే. ఏం చేయాల్నో అర్థమైతలేదు. పొలం పర్రెలు వాసింది. బర్రెలకు, మేకలకు వదిలేసిన. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాల.
>
> **- లక్కాకుల నడిపి రాజయ్య, రైతు**

## నాడు అలా.. నేడు ఇలా..

ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిశాయి. చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. కానీ వేసవి ప్రారంభానికి ముందే నీటి సమస్యలు మొదలు కావడం కలవరపెడుతున్నది. సాగునీటి విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రణాళికా లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏనాడూ నీళ్ల సమస్య రాలేదు. పంటలు ఎండిపోలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు, వ్యవసాయం, సాగునీరు, కరెంట్‌పైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూశారు. ఫలితంగా రైతులు పదేండ్లు సంతోషంగా పంటలు సాగు చేశారు. కానీ, కాంగ్రెస్ వచ్చాక సాగు సంక్షోభంలో చిక్కుకున్నది. పదేండ్ల కిందటి దుర్భర పరిస్థితులు పునరావృతమయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో పంటలు వేయడానికి ముందే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవి. సమృద్ధిగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేవి. దండిగా నీళ్లు, నిరంతర కరెంట్ సరఫరా అయ్యేది. కాంగ్రెస్ గద్దెనెక్కాక రైతుబంధు పథకానికి గ్రహణం పట్టింది. ఎరువులు, విత్తనాలకు కటకట ఏర్పడింది. సాగునీటి సమస్య తలెత్తింది. ఫలితంగా రైతులు కుదేలవుతున్నారు.

## నీటి కటకట..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యాసంగిలో భారీగా పంటలు సాగు చేశారు. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 10 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు వేయగా, ప్రధానంగా వరి ఎక్కువగా సాగు చేశారు. రైతులు ఆశించినట్లుగానే పొలాలు ఏపుగా పెరిగాయి. కొన్నిచోట్ల వరి పొట్ట దశలో ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే పొట్ట దశకు వస్తున్నాయి. నీరు అత్యధికంగా అవసరమైన ఈ సమయంలోనే నీటి సమస్య మొదలైంది. బావులు ఎండిపోగా, భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోతున్నాయి. నీళ్లు లేక పొలాలు బీళ్లు వారుతున్నాయి. కండ్ల ముందే వరి పైర్లు వాడిపోతుండడం చూసి రైతు గుండె తరుక్కుపోతున్నది. బోర్లు వేస్తున్నా చుక్కనీరు రాకపోవడం, ట్యాంకర్లతో నీళ్లందిస్తున్నా లాభం లేకపోవడంతో చివరకు పంటలను పశువులకు వదిలేస్తున్నారు.




# వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- నేరస్తులైన నిందితులపై ఉమ్మడి జిల్లాలో 40 చోరీ కేసులు
- నలుగురి అరెస్టు, రూ.10.17 లక్షల నగదు, ఆటో స్వాధీనం
- నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి వెల్లడి



ముఠా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి

వినాయక్‌నగర్, మార్చి 8 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన నలుగురు ముఠాగా ఏర్పడి కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 40 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ముఠా సభ్యులను శనివారం నిజామాబాద్ నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాందేవ్‌వాడ ప్రాంతంలో ఉన్న ఓ ట్రాన్స్‌పోర్ట్స్ ఆఫీసులో రెండు రోజుల క్రితం అర్ధరాత్రి దుండగులు నగదు దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఆటోరిక్షాలో అనుమానాస్పదంగా వచ్చిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. ట్రాన్స్‌ఫోర్స్ ఆఫీస్‌లో చోరీ చేసినట్లు అంగీకరించారని వెల్లడించారు. నిందితులను నాగారం ప్రాంతంలోని దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన పాత నేరస్తుడు షేక్ సాదిక్ (ఇప్పటివరకు 14 చోరీ కేసులు), సురేకర్ ప్రకాశ్ (4 చోరీ కేసులు), 50 క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షాదుల్లా (15 చోరీ కేసులు), దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన సాయినాథ్ విఠల్ రావు ముక్తే (3 చోరీ కేసులు)గా గుర్తించినట్లు వివరించారు. వీరి నుంచి రూ.10 లక్షల 17 వేల నగదు, ఆటో రిక్షా స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషిచేసిన నగర సీఐ శ్రీనివాస్‌రాజ్, త్రీ టౌన్ ఎస్సై హరిబాబు, సీసీఎస్ సీఐ సురేశ్, సిబ్బంది రవీందర్‌ను పోలీసు అధికారులు అభినందించారు.